# మజిలీ

వేసవి కాలం.

వేడిగాలి రివ్వున కొడ్తోంది.

"రేఖమ్మగారూ, మీరిక్కడ కూర్చోండమ్మా, నేను వెళ్ళి రైలు ఎన్నింటికో కనుక్కొస్తా" అని మేనేజరు శేషగిరిరావు లోపలి కెళ్లాడు.

రేఖా కూర్చోలేదు.

సిమెంటు బెంచీ మీద అరచేతి మందాన మట్టి వుంది.

చిరాకుపడ్తూ అలాగే నిలబడింది.

రెండు నిముషాల్లో శేషగిరిరావు తిరిగొచ్చాడు.

"అమ్మాయిగారూ, రైలు గంటలేటుటమ్మా ఏం చేద్దామంటారూ? మళ్ళా ఇంటికి పోదామంటారా?"

ఆ మాటతో రేఖ చిరాకు ఇంకా ఎక్కువైంది.

"ఈ విషయం ఇంటి దగ్గరే కనుక్కోకూడదూ!" అంటూ అతని మీద విసుక్కుంది.

"ఈ పల్లెటూరికి వచ్చి చాలా పొరపాటు చేశాను" అని తనని తాను తిట్టుకుంది.

రేఖ ముఖంలోకి భయం భయంగా చూస్తూ

"అమ్మాయిగారూ ఏం చేద్దామంటారూ" అనడిగాడు మళ్ళీ.

ఆ ఎద్దు బండీలో గతుకుల రోడ్డు మీద నాల్గుమైళ్ళ ప్రయాణం. తలుచుకుంటేనే ఒళ్లు జలదరించింది రేఖకి.

'మళ్ళా ఇంటికి వద్దులే. ఇక్కడే కూర్చుంటా' అంది రేఖా.

శేషగిరిరావు పైబట్టతో సిమెంటు బెంచీమీద దుమ్ము దులిపాడు.

చేతి సంచిలోంచి దుప్పటి తీసి దాని మీద పరిచి "కూర్చోండమ్మా" అన్నాడు.

రేఖ కూర్చుంది.

"నేను సామాన్లు దగ్గర వుంటానమ్మా. ఏవన్నా కావాలంటే పిలవండి!" అన్నాడు.

రేఖ అలాగేనని తలూపింది.

శేషగిరిరావు వెళ్ళిపోయాడు.

రేఖ ఒంటరిగా కూర్చుంది.

అదొక చిన్న పల్లెటూరు.

ఆ స్టేషన్ మరీ చిన్నది.

ప్లాట్‌ఫారమ్ మీద చిన్న రేకుల షెడ్డు వుంది. అక్కడక్కడ వున్న చెట్ల కింద సిమెంటు బెంచీలు.

స్టేషన్ చుట్టూ దట్టమైన అడవి.

ఎడారిలో ఒంటరి పక్షిలా వుందా స్టేషన్.

రేఖ వాచీ చూసుకుంది.

ఇప్పటికి పది నిముషాలు మాత్రం గడిచింది.

స్టేషన్‌లో ఏ విధమైన అలికిడీ లేదు. గాలి కూడా స్థంబించిపోయింది.

కదలని కాలాన్ని, రాని రైలుని తిట్టుకుంది రేఖ.

గలగలపారే సెలయేరులా ఎప్పుడూ సందడిగా వుండే రేఖకి ఆ ఒంటరితనం పిచ్చెక్కిస్తోంది.

ఇంతలో-

"అమ్మగారూ! వేరుసెనక్కాయ కావాలా" అన్న పిలుపు వినబడి రేఖ పక్కకు తిరిగి చూసింది.

చేతిలో బుట్టతో తొమ్మిదేళ్ళ కుర్రాడు నిలబడి వున్నాడు.

ఎర్రగా సన్నగా వున్నాడు. వేసుకున్నలాగు, చొక్కా అక్కడక్కడ చిరిగినా శుభ్రంగా వున్నాయి.

ఆ కుర్రాడిని చూడగానే రేఖ ముఖంలో చిరాకు తొలిగింది.

"ఏవిటవి?" అనడిగింది.

"వేరుశనక్కాయలమ్మా కావాలా" అన్నాడు.

రేఖకి తినాలని లేకపోయినా ఆ కుర్రాడితో మాట్లాడాలని-

"మంచి కాయలు తీసి ఇవ్వు" అంది.

ఆ కుర్రాడు కింది కూర్చుని బుట్టలోంచి కాయలు తీయసాగాడు.

రేఖ అతని వేపు చూస్తూ- "నీ పేరేవిటి" అడిగింది.

'నా పేరు కృష్ణారావండీ. మా అమ్మ కిట్టయ్యా' అంటూ పిలుస్తుందండీ అన్నాడు.

ఆ కుర్రాడు అలా చెప్తోంటే చూడ ముచ్చటగా అన్పించింది రేఖకి.

"అలానా. మరి నేను కిట్టూ అని పిలుస్తానే" అంది నవ్వుతూ.

కిట్టయ్య తలెత్తి చూసి తనూ నవ్వాడు.

తను ఏరిన కాయలన్నీ డబ్బాలో పోసి కొలిచి రేఖ కర్చీఫ్‌లో పోశాడు.

రేఖ పర్సు తీసి రెండ్రూపాయల కాగితం ఇచ్చింది.

ఆ కాగితాన్ని అటూ, ఇటూ తిప్పుతూ - 'చిల్లర లేదండీ' అన్నాడు కిట్టయ్య.

"పర్వాలేదు. వుంచుకో.

కిట్టయ్య ఆశ్చర్యపోయాడు. "వద్దండీ. చిల్లర తెస్తాను" అంటూ పోబోయాడు.

"ఏయ్! తీసుకోమంటుంటే, నువ్వు తీసుకోకపోతే నాకు కోపం వస్తుంది" అంటూ కిట్టయ్య చేతిలోంచి రెండ్రూపాయలు తీసుకొని అతని చొక్కాజేబులో పెట్టింది రేఖ.

అది చూసి కిట్టయ్య చాలా ఆనందపడ్డాడు. రెండ్రూపాయల్ని చూసి అమ్మ ఎంత సంతోషిస్తుందో.

'వస్తానమ్మా' అన్నాడు రేఖకి రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెడ్తూ.

'అప్పుడేనా, ఎండగా వుంది. కాస్సేపు కూర్చో'.

రేఖ అలా అనగానే వాడికీ చాలా ఎండగా అన్పించింది.

మళ్ళీ కింద కూర్చున్నాడు.

"మీ నాన్న ఏం చేస్తున్నాడు" రేఖ అడిగింది.

ఆ మాటతో కిట్టయ్య ముఖం నల్లబడింది "నాకు అయ్య లేడమ్మా. నేనూ అమ్మ ఇద్దరమే".

"అలాగా పాపం. అయితే చాలా కష్టమే"

కిట్టయ్య తలొంచుకుని నేలమీద పుల్లతో గీతలు గీస్తున్నాడు.

క్షణం ఆగి అంది రేఖ. 'కిట్టూ. నువ్వు హాయిగా చదువుకోకూడదూ. ఇలా వేరుశెనక్కాయలు అమ్ముతూ తిరగడం నాకేం బాగాలేదు."

ఆ మాటతో కిట్టయ్యకి తను చిన్నప్పుడు బడికి వెడతానని గొడవ చెయ్యడం తల్లి తిట్టి తనని పనిలో పెట్టడం, జ్ఞాపకం వచ్చాయి.

ఇప్పటికీ ఏకాస్త సమయం దొరికినా ఊళ్ళోవున్న పాతబడి దగ్గిరికెళ్ళి అక్కడ పిల్లలు చదువుతూంటే వింటూ కూర్చుంటాడు.

"ఏం చదువుకోడం ఇష్టం లేదా'

"ఎందుకిష్టం లేదండీ. చాలా ఇష్టం. కానీ మా అమ్మకే నేను చదువుకోడం ఇష్టం లేదు"

"ఎందుకని"

"డబ్బులేకండీ"

"ఓస్ డబ్బులేకా. పోనీ నిన్ను నేను చదివిస్తాను చదువుకుంటావా".

రేఖ మాటలకు ఆశ్చర్యపోయాడు కిట్టయ్య. మీరు... నన్ను... చదివిస్తారా".

"అవును. ఏం మా నాన్నకి పట్నంలో పెద్ద వ్యాపారముంది. మాకొక సినిమా హాలు ఫైవ్‌స్టార్ హోటలు వున్నాయి. మా ఇల్లు కూడా చాలా పెద్దది. నువ్వు మా ఇంట్లో వుండి చదువుకోవచ్చు. కావాలంటే మీ అమ్మని కూడ తీసుకురా మాకు సర్వెంట్ క్వార్టర్సు వున్నాయి. వాటిల్లో మీరుండొచ్చు. నువ్వు ఎంతవరకు చదువుకుంటే అంతా చదివిస్తాను. వస్తావా"

కిట్టయ్య నోరు తెరుచుకుని వింటున్నాడు.

రేఖ వేపు చూశాడు.

నల్లంచున్న ఎర్రటి పట్టులంగా వేసుకుంది. ఎర్ర జాకట్టు పైన జరీపువ్వులు కుట్టిన తెల్లటి జార్జెట్ ఓణీ మెడలో రెండు పేటల ముత్యాల దండ. చెవులకు కెంపుల జూకాలు, ఒక చేతికి వాచీ, రెండో చేతికి నిండుగా బంగారు గాజులు. రెండు జడలు. కాళ్ళకు ముఖమల్ చెప్పులు.

కిట్టయ్యకి తన ముందు కూర్చున్న రేఖ పద్దెనిమిదేళ్ళ పట్నం పిల్లలా లేదు. తను రోజూ దణ్ణం పెట్టుకునే దుర్గమ్మలా వుంది.

"ఏం కిట్టూ వస్తావా. రావా" వాచీ చూసుకుంటూ అడిగింది.

కిట్టయ్య ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. ఆ క్షణాన రేఖతో పట్నం వెళ్ళిపోవాలన్పించింది వాడికి.

"వస్తానమ్మా. తప్పక వస్తాను. కానీ అమ్మతో చెప్పలేదుగా" అమాయకంగా అన్నాడు.

రేఖ నవ్వింది.

"ఇప్పుడే రావద్దులే నేను వెళ్ళాక వుత్తరం వ్రాస్తాను. లేకపోతే ఎవర్నన్నా పంపిస్తాను. అప్పుడు వచ్చెయ్".

ఇంతలో శేషగిరిరావు పరిగెట్టుకు వచ్చాడు.

"అమ్మాయిగారూ రైలొస్తోందిరండమ్మా"

రేఖ లేచి నుంచుని హ్యాండ్‌బ్యాగ్ చేతికి తగిలించుకుంది.

రైలు పెద్ద శబ్దం చేస్తూ వచ్చి స్టేషన్‌లో ఆగింది.

రేఖ గబగబా ముందుకు నడిచింది.

కిట్టయ్య తనూ లేచి నిలబడ్డాడు. రైలు అంత తొందరగా వచ్చినందుకు తిట్టుకున్నాడు. ఇంకాస్సేపు అమ్మాయిగారితో మాట్లాడి పట్నం విశేషాలు తెలుసుకోవాలని వుంది.

రేఖ రైలు దగ్గరికి నడిచింది.

శేషగిరిరావు సామాన్లు రైల్లో పెడుతున్నాడు.

కిట్టయ్య కూడా రైలు దగ్గరికి వచ్చాడు.

రేఖతో ఏవేవో చెప్పాలని వుంది. కానీ రేఖ ఇటు చూడటంలేదు. రైలు ఎక్కేతొందరలో వుంది.

ఇంతలో రైలు కూతవేసింది.

"అమ్మాయిగారూ, వెళ్ళిన వెంటనే వుత్తరం రాయండి మర్చిపోకండి."

కిట్టయ్య మాటలు రైలు మోతలో రేఖకి వినబడ్డాయో లేదో.

రైలు కదులుతూంటే కిట్టయ్యకి చెయ్యి వూపింది రేఖ. రైలు వెళ్ళాక కిట్టయ్య ఇంటి దారిపట్టాడు మెల్లగా.

* * *

ఆ రాత్రి కిట్టయ్యకు నిద్రపట్టలేదు.

ఏవేవో కలలు.

ఆ కలల్లో తను చాలా పెద్ద చదువు చదివాడు. ఎంతో పెద్ద వుద్యోగస్థుడయ్యాడు. పెద్ద కార్లో తిరుగుతున్నాడు. పెద్ద ఇంట్లో వుంటున్నాడు.

తెల్లారి లేచాక ఆ కలలన్నీ గుర్తు చేసుకుంటూ-

"అమ్మాయిగారు తొందరగా వుత్తరం రాస్తే బాగుండును" అనుకున్నాడు.

కిట్టయ్య ముఖం కడుక్కురాగానే తల్లి నర్సమ్మ పుల్లలేరుకురమ్మని బుట్ట ఇచ్చింది కాని కిట్టయ్యకు పుల్లలేరడం ఇష్టంలేదు.

తను పట్నం వెళ్ళి పెద్ద చదువులు చదవబోతున్నాడు. ఇంకా ఇటువంటి పనులు చెయ్యడమేమిటి.

తల్లిమాట విన్పించుకోనట్టు వెళ్ళిపోయాడు.

నర్సమ్మ తెల్లబోయింది.

ఆరోజే కాదు-

ఆ మర్నాటి నుంచీ కిట్టయ్య పుల్లలేరడం పొద్దునా సాయంత్రం గొడ్ల వెంట వెళ్ళి పేడ ఎత్తడం వేరుశెనక్కాయలు అమ్మడం అన్నీ మానేశాడు.

రోజూ పొద్దున్నే లేచి గంజితాగి రామాలయం దగ్గర పోస్టుమేన్ కోసం ఎదురుచూస్తూ కూర్చునేవాడు. పోస్టుమేన్ వచ్చాక అతడిని వుత్తరాలు అడిగి అతడు లేవంటే స్టేషన్ కెళ్ళి కూర్చునేవాడు రేఖ ఎవర్నైనా పంపిస్తుందేమోనని ఎదురుచూస్తూ.

సాయంత్రం కనుచీకటి పడుతూండగా నిరాశగా ఇంటికి తిరిగొచ్చేవాడు.

రాత్రి అన్నం తిన్నాక తాడిచెట్టుకింద గోనెపట్టా పరుచుకుని పడుకొని ఆకాశంలోని చుక్కల్ని చూస్తూ-

అమ్మాయిగారూ ఇవ్వాళ ఎందుకు వుత్తరం రాయలేదో.

బహుశ రేపు వస్తుందేమో.

వుత్తరం రాగానే అమ్మతో చెప్పి, ఇద్దరూ కలిసి పట్నం వెళ్లాలి. అక్కడ అమ్మాయి గారింట్లో వుండి హాయిగా చదువుకుంటాడు.

అన్నట్టు వుత్తరం రాగానే సోవయ్యకీ సింగన్నకి చూపాలి. వాళ్ళతో అమ్మాయిగార్ని గూర్చి చెప్పాలి.

ఎదవలు బాగా ఏడుస్తారు. తను బాగా చదువుకుని పెద్ద వుద్యోగం వచ్చాక వాళ్ళని పట్నం తీసికెడతానని చెప్పి ఓదార్చాలి.

అనుకుంటూ కళ్ళు మూసుకునేవాడు.

ఆ రేపు నేడుగా మారి నిన్న అవుతోంది.

కాని వుత్తరం రావడంలేదు.

పట్నం నుంచి ఎవరూ రావడంలేదు.

కిట్టయ్యకి మనసులో చెప్పరాని దిగులు కలుగుతోంది.

"అమ్మాయిగారు వుత్తరం ఎందుకు రాయలేదో".

క్షణక్షణం ఈ ప్రశ్న వేసుకుని దుఃఖపడుతున్నాడు కిట్టయ్య.

తిండికీ నిద్రకీ దూరమయ్యాడు. రోజల్లా రైల్వేస్టేషన్‌లోనో, రామాలయం మెట్లమీద గడుపుతున్నాడు.

అప్పుడప్పుడు అన్పించేది-

"ఇక వుత్తరం రాయరేమో" అని కాని వెంటనే తనకి తాను సర్ది చెప్పుకునేవాడు.

"ఎందుకు రాయరు. తప్పకుండా రాస్తారు. ఏదో పనుల తొందరలో మర్చిపోయి వుంటారు. రేపు తప్పక వస్తుంది."

అలా ఎప్పుడూ తనలో తను గొణుక్కుంటూ ఆలోచిస్తూ కూర్చుండే కొడుకుని చూసి నర్సమ్మ కంగారుపడింది.

మొదట్లో కొడుకు చెప్పినపని చెయ్యటం లేదని తిట్టింది.

కానీ తర్వాత తర్వాత కొడుకు ఆలా వులుకూ పలుకూ లేకుండా అన్నం కూడా సరిగ్గా తినకుండా వుంటుంటే సహించలేకపోయింది.

"బాబూ. కిట్టయ్యా ఎందుకురా అలా వున్నావ్. సెప్పు తండ్రీ" అని బ్రతిమిలాడింది. కన్నీళ్ళు పెట్టుకుంది.

కిట్టయ్యకి ఏం చెప్పాలో తోచలేదు.

రేఖ దగ్గిరినుంచి వుత్తరం వచ్చాక తల్లికి చెప్పాలని వాడి కోరిక.

అందుకే తల్లి ఎంత అడిగినా కారణం చెప్పలేదు.

కొడుకుని అడిగి అడిగి విసుగుపుట్టి వూరుకుంది నర్సమ్మ.

ఇప్పుడు తనే వేరుశెనక్కాయలు అమ్ముతోంది.

రోజులు వారాలుగా, వారాలు నెలలుగా మారాయి.

ఒక రోజు మధ్యాహ్నం పన్నెండుగంటల సమయం

నర్సమ్మ వేరుశెనక్కాయల బుట్ట పుచ్చుకుని స్టేషన్‌కి వచ్చింది.

అప్పుడే ట్రెయిన్ వచ్చింది.

దాన్లోంచి రేఖ, ఆమె అన్నయ్య దిగారు.

"రేఖా. నువ్విక్కడే వుండు. బండీ ఏదైనా వుందేమో చూసొస్తాను." అన్నాడు.

రేఖ విసుక్కుంది.

"అన్నయ్యా నేనప్పుడే అన్నాను. నామాట విన్పించుకున్నావా. ముందే మావయ్యకి రాసివుంటే బండీ పంపేవారు. మనకీ అవస్థ వుండేది కాదు."

"సరేలే" అని బయటికి వెళ్ళిపోయాడు రేఖ అన్నయ్య.

రేఖ ఒక్కతే నిలబడింది.

"వేరుశెనక్కాయలు కావాలామ్మా" అంటూ రేఖ దగ్గిరికొచ్చింది నర్సమ్మ.

రేఖ తలతిప్పి చూసింది.

సన్నగా బలహీనంగా వున్న నర్సమ్మ నెత్తిమీద బుట్టతో నిలబడింది.

"అక్కరలేదు" అంది రేఖ

నర్సమ్మ ఉస్సురనుకుంటూ చుట్టూ చూసింది.

ఆ స్టేషన్‌లో ఇంకెవరూ లేరు.

బుట్ట కింద పెట్టి అక్కడే కూలబడింది నర్సమ్మ.

పైన ఎండ మాడ్చేస్తోంది.

కొంగుతో ముఖం తుడుచుకుంది నర్సమ్మ.

దాహంగా అన్పించింది నర్సమ్మకు.

రేఖను మంచినీళ్ళు అడుగుదామనుకుని కూడా గొప్పింటి పిల్లలా వుంది అడుగుతే ఏమనుకుంటుందో అని భయపడి వూరుకుంది నర్సమ్మ.

రేఖ గేటువేపు చూసింది.

అన్నయ్య ఇంకా రావడంలేదు.

ఎదురుగా నర్సమ్మ కన్పించింది.

ఒంటరిగా నుంచోడం విసుగ్గా వుంది రేఖకి.

అన్నయ్య వచ్చేవరకూ కాలక్షేపంగా వుంటుందని నర్సమ్మని మాటల్లోకి దించింది.

"అవ్వా!" చాలా ఎండగా వుంది కదూ అనడిగింది రేఖ.

రేఖ తనతో మాట్లాడ్డం చూసి తడబడి పోయింది నర్సమ్మ.

"అవునండమ్మా" అంది ఎంతో వినయంగా

"ఏం అవ్వా ఎండలో ఇలా తిరక్కపోతే ఇంటిదగ్గర కూర్చోకూడదూ."

'అలా కూసుంటే ఎలాజరుగుతుంది తల్లి కడుపులోకి తిండి కావద్దూ" అంది నర్సమ్మ.

"ఏం నీకెవరూ లేరా"

"ఎందుకు లేరమ్మా పదేళ్ళ కొడుకున్నాడు. కాని ఏం లాభం తల్లీ. ఒక్క పనీ చెయ్యడు. ఇది వరకు బాగానే వుండేవాడు. ఈ మద్దెనే ఇలా తయారయ్యాడు. ఏం గాలి సోకిందో, అక్కడికీ తాయెత్తులు కట్టించా.... ఆ పోలేరమ్మ తల్లికి దణ్ణం పెట్టుకున్నా...' అంటూ ఏవేవో చెప్తోంది నర్సమ్మ.

ఇంతలో

"అమ్మా"

అన్న పిలుపు వినిపించింది.

నర్సమ్మ రేఖ ఇద్దరూ ఒకేసారి తలెత్తి చూశారు.

కిట్టయ్య వస్తూ కన్పించాడు.

'అడేనమ్మా నాకొడుకు సూడు తల్లీ. తిండీ నీల్లూ మానేసి ఎలా పూచికపుల్లల్లా వున్నాడో ఒక మాటాలేదు. మంతీలేదు. ఎప్పుడూ ఒక మూలకూసుని గొనుక్కుంటూ వుంటాడు" అని కొడుకువేపు తిరిగి

"ఏందిరా కిట్టయ్యా. ఇలా వచ్చావ్" అనడిగింది నర్సమ్మ.

కిట్టయ్యకి తల్లి మాటలు వినబడలేదు. రేఖవైపు చూస్తున్నాడు.

వాడి ముఖం ఆనందంతో వెలిగిపోతోంది.

కళ్ళలో మెరుపులు.

సంతోషంతో నోట మాటరావడం లేదు.

అమ్మాయిగారు... అమ్మాయిగారు వచ్చారు.

తనని తీసికెళ్ళడానికి వచ్చారు.

అమ్మాయిగారితో పట్నం వెళ్ళి పెద్ద చదువులు చదువుతాడు.

అబ్బ! ఎన్నాళ్ళకి వచ్చారు. నిజంగా అమ్మాయిగారు చాలా మంచివారు.

"కిట్టయ్యా ఎంట్రా అలా నిలబడి పోయావ్" నర్సమ్మ అడుగుతోంది.

కిట్టయ్య రేఖనే చూస్తూ-

"అమ్మాయిగారూ, వచ్చారా, నన్ను తీసికెళ్ళడానికి వచ్చారా" అన్నాడు తడబడి పోతూ.

అతని మాటలకు ఆశ్చర్యపడి ఆ తర్వాత చిరాకు పడ్తూ.

"ఎవరు నువ్వు" అంది రేఖ.